thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 130 | జగిత్యాల | బుధవారం 12 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

బోదన, శ్రేయాస్ అదరహో



11

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

4



- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా

## కొలంబియాను కుదిపేసిన భూకంపం

- 7.4 తీవ్రతతో పెను ప్రకంపనలు
- 132కు చేరిన మృతుల సంఖ్య..
- 570 మందికి గాయాలు
- పలు నగరాల్లో భవనాలు నేలమట్టం..
- విమాన సేవలకు అంతరాయం

4



## మన్మోహన్ ప్రభావశీలి

- కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు
- మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక

4





# ఖేలో ఇండియాలో సత్తా చాటాలి

డిసెంబరులో యువ క్రీడా సంబరం

20 క్రీడాంశాల్లో జాతీయ స్థాయి పోటీలు

### స్టేడియాల ఆధునికీకరణకు అవసరమైన నిధులు
### ప్రారంభ, ముగింపు వేడుకలకు క్రీడా, సినీ ప్రముఖులు
### ఏర్పాట్లపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆతిథ్యమివ్వనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026' పోటీలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు, నిర్వహణపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీల కోసం అవసరమైన మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో ఈ పోటీలను వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. హైదరాబాద్‌లోని క్రీడా ప్రాంగణాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, వాటిని శాశ్వత ప్రాతిపదికన అంతర్జాతీయ స్థాయికి సరిపోయేలా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. *- హైదరాబాద్, ఆగస్టు 11*

# రక్తమోడిన రహదారులు

### సంగారెడ్డిలో రెండు ఘోర ప్రమాదాల్లో 9మంది దుర్మరణం

- ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్.. ఏడుగురు కూలీలు మృతి..
- ఐదుగురికి గాయాలు
- వెంకటాపూర్ కూడలి వద్ద మరో ప్రమాదం.. ఇద్దరు మృతి

.. వివరాలు 2లో



## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి



- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్–2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

2

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

- అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

2



## 'చేయూత' పింఛన్లకు దరఖాస్తులు

3

ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- 15న సంగారెడ్డి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- సీఎం చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమాలు
- ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3





## ఆ సంస్థతో సీఎం సోదరుడికి సంబంధం లేదు

- నిబంధనల మేరకే సంస్థకు భూ కేటాయింపులు
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

3

## 22ఏ భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- దరఖాస్తుల పరిష్కారం యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- 14లోగా అన్ని పత్రాలు ఆన్‌లైన్‌లోకి
- సబ్ రిజిస్ట్రార్ విచక్షణాధికారాలకు చెక్
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

3





## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

- త్వరలోనే బండారం బయటపెడతాం
- సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

3

చురకలు





# గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

## నటుడు ప్రకాశ్ రాజ్ సెల్ఫీ వీడియో

**బెంగళూరు, ఆగస్ట్ 11:** బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది. నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ కేసులో జులైలో బెంగళూరు కోర్టు ముందు ప్రకాశ్ రాజ్ హాజరుకాగా.. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

## జీవో విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# లాఠీచార్జ్ సమర్థనీయమే

## పరిస్థితిని అదుపు చేసేందుకు తప్పదు

## సమర్థించుకున్న జార్ఖండ్ రాష్ట్ర పోలీస్ విభాగం

**రాంచీ, ఆగస్ట్ 11:** రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి. ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. లాఠీచార్జ్ కూడా జరిగింది. రోడ్డు క్లియర్ చేయాలని పదే పదే అభ్యర్థించినా నిరసన కారులు పట్టించుకోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. కొందరు బ్యారికేడ్లను ధ్వంసం చేశారని, వాహనాలను అడ్డుకున్నారని ఆరోపించాయి. మరోవైపు, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే పోలీసులు బలప్రయోగానికి దిగారని విద్యార్థులు ఆరోపించారు. లాఠీ చార్జ్ సందర్భంగా కనీసం 100 మందికిపైగా విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారని ఓ యువకుడు ఆరోపించారు. పరస్పర ఆరోపణల నేపథ్యంలో ర్యాలీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. అడ్డంకులు సృష్టించిన వారు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటి నిరసనల్లో 14 మంది పోలీసులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఒకరికి తీవ్ర గాయమైందని అన్నారు. అయితే, పరిస్థితిని అదుపు చేసేందుకు వీలైనంత పరిమితిస్థాయిలోనే బలప్రయోగం చేశామని రాంచీ ఎస్ఎస్‌పీ రాకేశ్ రంజన్ చెప్పారు.

# ఎయిడ్స్ రహిత రాష్ట్రం లక్ష్యం

## నేడు హైదరాబాద్‌లో అవగాహనా ర్యాలీ

## వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** ఎయిడ్స్ రహిత తెలంగాణ తమ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణెళి లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# ఖేలో ఇండియాలో తెలంగాణ సత్తా చాటాలి

- డిసెంబరులో యువ క్రీడా సంబరం
- 20 క్రీడాంశాల్లో జాతీయ స్థాయి పోటీలు
- స్టేడియాల ఆధునికీకరణకు నిధులు
- ప్రారంభ, ముగింపు వేడుకలకు క్రీడా, సినీ ప్రముఖులు
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 12:** తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించే స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబరులో పోటీల నిర్వహణకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలిరానున్న నేపథ్యంలో వారికి అవసరమైన మౌలిక వసతులు, వసతి, రవాణాతో పాటు ఇతర సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆయా విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

### శాశ్వత ప్రాతిపదికన స్టేడియాల అభివృద్ధి

హైదరాబాద్‌లోని స్టేడియాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అనుగుణంగా వాటిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఖేలో ఇండియా పోటీల కోసం చేపట్టే అభివృద్ధి పనులు భవిష్యత్తులోనూ రాష్ట్ర క్రీడాకారులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నందున ఒక్కో క్రీడకు అనువైన వేదికలను ముందుగానే గుర్తించాలని చెప్పారు. ఆయా వేదికల్లో అవసరమైన సదుపాయాలు, క్రీడా పరికరాలు, ప్రేక్షకుల సౌకర్యాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

### వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ

ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ముఖ్య అతిథులతో పాటు ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, జాతీయ స్థాయి క్రీడా ప్రముఖులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధి, పోటీల నిర్వహణ, క్రీడాకారులు, అతిథులకు వసతి, రవాణా తదితర అంశాల్లో స్పష్టమైన పని విభజన చేసుకుని అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ క్రీడా సామర్థ్యాన్ని దేశానికి చాటిచెప్పేలా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎ. సోనీబాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 11:** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

## యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం

## ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా.. తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

## అంతర్జాతీయ దృష్టి ఆకర్షించేలా సమ్మిట్

## అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రక్తమోడిన రహదారులు

- సంగారెడ్డిలో రెండు ఘోర ప్రమాదాల్లో 9 మంది దుర్మరణం
- ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్.. ఏడుగురు కూలీలు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- వెంకటాపూర్ కూడలి వద్ద మరో ప్రమాదం.. ఇద్దరు మృతి



**సంగారెడ్డి, ఆగస్టు 11:** సంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాలు తొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఏడుగురు దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఒకే జిల్లాలో రెండు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలు ప్రతిరోజూ కూలి పనుల కోసం జహీరాబాద్ పరిసర ప్రాంతాలకు వస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం కూడా హుమనాబాద్ నుంచి జహీరాబాద్‌కు ఆటోలో బయలుదేరారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. జహీరాబాద్ మండలం సత్వార్ వద్దకు చేరుకున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు.

### డివైడర్ దాటి దూసుకెళ్లిన కారు

ఈ విషాదం నుంచి తేరుకోకముందే జిల్లాలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటి అవతలి వైపునకు ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం ధాటికి నాలుగు వాహనాలు ధ్వంసమైనట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఒకే రోజు రెండు ఘోర ప్రమాదాల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడంతో సంగారెడ్డి జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 12:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల చికిత్స విషయంలో ఎలాంటి లోటు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 22ఏ భూములపై ఆందోళన వద్దు



- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- దరఖాస్తుల పరిష్కారం యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- 14లోగా అన్ని పత్రాలు ఆన్‌లైన్‌లోకి
- సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 11:** నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన, సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని తెలిపారు. సచివాలయంలో మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో నిషేధిత ఆస్తుల జాబితా, 22ఏ సమస్యలపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర పత్రాలన్నింటినీ ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను పొంగులేటి ఆదేశించారు. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రిజిస్ట్రేషన్ సమయంలో ఏది అసలైన పత్రమో, ఏది నకిలీదో గుర్తించేందుకు సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీల వివరాలను కూడా సబ్ రిజిస్ట్రార్లు పరిశీలించే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో వాస్తవాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ప్రతి దరఖాస్తును కేసుల వారీగా రోజూ సమీక్షించాలని స్పష్టం చేశారు. 22ఏ పేరుతో ఉద్దేశపూర్వకంగా పేదలు, అర్హులకు అన్యాయం చేస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు ఇవ్వొద్దని గతంలోనే స్పష్టత ఇచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా మాత్రమే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో చిన్న తప్పు జరిగినా క్షమించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు సంబంధిత కలెక్టర్ లేదా రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించవద్దని పొంగులేటి స్పష్టం చేశారు. అవసరమైతే మూడు రోజుల సమయం తీసుకుని, రిజిస్ట్రేషన్ ఎందుకు తిరస్కరించాల్సి వస్తుందో కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఇకపై నిషేధిత ఆస్తులకు సంబంధించిన ప్రతి దరఖాస్తును తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కు పంపించాలని సూచించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ మధ్యనే సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని పేర్కొన్నారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, నిషేధిత ఆస్తుల జాబితాలు వేర్వేరుగా ఉండేవని, వాటిని సమీకరించిన తర్వాత కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపించడంతో మొత్తం రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. తాజాగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో వివరాలను సరిపోల్చుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి వివరించి తక్షణమే అమలు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

- త్వరలోనే బండారం బయటపెడతాం
- సీఎం సోదరులంతా కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, ఆగస్ట్ 11:** సీఎం రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయి కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ. 2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ. 7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థకి ఛైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- 15న సంగారెడ్డి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- సీఎం చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమాలు
- ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు కొత్తగా 16,32,810 ఆహార భద్రత కార్డులను జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 61,08,544 మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో ఆహార భద్రత కార్యక్రమానికి ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని ఉత్తమ్ తెలిపారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ. 20 వేల కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు వివరించారు. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుల చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించి నిమిషాల వారీ షెడ్యూల్‌ను సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో కార్యక్రమం పూర్తయ్యేలా చూడాలన్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జరిగే పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు, 3.43 కోట్ల మంది లబ్ధిదారులు, ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



# 'చేయూత' కొత్త పింఛన్లకు దరఖాస్తులు

## ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

## అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు. ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.

# యూపీఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఒడవు

## కమ్యూనిస్టులు అబద్దాల ప్రచారం తగదన్న నిర్మల

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూన్ఫి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత... వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు. సమాధానం వినే ధైర్యం లేని పిరికిపందలని విమర్శించారు.

# సగర్వంగా హర్ ఘర్ తిరంగా

## ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళు లర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## సంపాదకీయం



# ఎవరి కోసం వీరి ఆందోళనలు?

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# కొలంబియాను కుదిపేసిన భూకంపం

- 7.4 తీవ్రతతో పెను ప్రకంపనలు
- 132కు చేరిన మృతుల సంఖ్య..
- 570 మందికి గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు
- పలు నగరాల్లో భవనాలు నేలమట్టం..
- విమాన సేవలకు అంతరాయం
- సహాయక చర్యల్లో సైన్యం..
- విదేశాల నుంచి సాయం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికోతోపాటు అమెరికా కూడా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

# పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపీల పరస్పర నినాదాలు






**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# అమిత్ షా లోక్‌సభకు రాలేదు

## పిరికి వాడంటూ జైరామ్ రమేశ్ పోస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

# దివంగత ప్రధాని మన్మోహన్ ప్రభావశీలి

## కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు

## మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు. మరికొందరిని బీజేపీలో కలిపేసుకున్నారు. మరికొన్ని అసాధారణ సందర్భాల్లో కొందరికి మంత్రి పదువులు కూడా దక్కాయి' అని సోనియా గాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన కామెంట్స్ దేశ పార్లమెంటు చరిత్రలో అత్యంత దిగజారిన క్షణంగా నిలిచిపోతాయని అన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులను క్షమిస్తున్న ప్రధాని మోదీ ఈ విషయంలో తనని తాను క్షమించుకోవాలని చురకలంటించారు.

# సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక

- వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించాలి.




**దామరిగిద్ద మండలం, ఆగస్టు,11:** దామరగిద్ద మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు.మండల మహిళా సమాఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్‌వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరించారు.యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళలకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సీతాఫలాలను నిల్వ చేసేందుకు, అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. యూనిట్ నిర్వహణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.దీనిపై తహసీల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ,,మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలాన్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు.స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు.మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆరాఅనంతరం మండలంలోని స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు రుణాలు, ఎస్‌పీఏ, కిశోర బాలికల సంఘాల ఏర్పాటు, వీఓ భవనాల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.మండలంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలను మరో 20 రోజుల్లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే 'మై వన్' సాంకేతికతను వినియోగించి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

**వీఓ భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్**

చివరగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న వీఓ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెంకట్ రాములు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, ఎంపీడీవో సాయి లక్ష్మీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కు అండగా షీ" టీమ్

- పరిగి సబ్ డివిజన్ "షీ" టీం ఇంచార్జ్ నర్సింహులు

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,11:** మహిళల భద్రత కోసమే "షీ" టీమ్ నిరంతరం పనిచేస్తుందని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు తెలిపారు.మంగళవారం కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేజీబివి పాఠశాలలో జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ మాట్లాడుతూ,, మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 112, 181 ను సంప్రదించాలని అన్నారు. మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అదేవిదంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ మానవ అక్రమ రవాణా తోపాటు మద్యపాన నిషేధం అంతే కాకుండా మహిళలు బాలికలు టి–సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని తెలిపారు.









ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కే. స్రవంతి, ఏఎస్ఐ ఎల్లప్ప, కళాబృందం ఇంచార్జి అశోక్,మరియు టీమ్, ఉపాధ్యాయులతో పాటు "షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# "కన్నవారి భారం తగ్గించి.. ఆడపడుచుల కల నెరవేర్చి!"

- పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండ
- 47 మంది లబ్ధిదారులకు రూ.47.05 లక్షల విలువైన చెక్కుల పంపిణీ
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ, ఆగస్టు 11 :** పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను అమలు చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.మంగళవారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐనవోలు మండలానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల కింద రూ.47,05,452 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల వివాహాలకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోహన్ గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జేబీఎం జిల్లా చైర్మన్ రుగ్వేద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సాంబయ్య, మహేష్‌గౌడ్, ఎలిశా, సీనియర్ నాయకులు మధు, రాకేష్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్‌రావు, సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా గజ్వేల్ జాలిగామ బైపాస్ రోడ్డు

- బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్

**సమయం న్యూస్ గజ్వేల్, 11 ఆగస్టు 2026 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణం నుంచి రామాయంపేట వెళ్లే జాలిగామ బైపాస్ రోడ్డు సంపూర్ణంగా గుంతలమయంగా మారి, వాహనదారులకు నరకప్రాయంగా తయారైందని గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక బైపాస్ రోడ్డులో పెద్ద ఎత్తున గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతంలో వార్తాపత్రికలలో ఈ రహదారి దుస్థితిపై విస్తృతంగా కథనాలు ప్రచురితమైనప్పటికీ, సంబంధిత అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి, వెంటనే స్పందించి జాలిగామ బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరపున బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు

**వికారాబాద్, ఆగస్టు,11:** "సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య సమక్షంలో మంగళవారం వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 1,000 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ మోసాలు, OTP మోసాలు, లోన్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా నేరాలు,పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు, ఫేక్ అకౌంట్లు, ఆన్‌లైన్ గేమింగ్ & బెట్టింగ్, సైబర్ బ్లాక్‌మెయిల్ తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ OTP, PIN, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, ఇతర పోలీస్ అధికారులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు మహిళా సంఘాల కుట్టిన యూనిఫాంల పంపిణీ చేసిన...

మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్,కమిషనర్ బలరాం నాయక్



**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,11:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించిన యూనిఫాం వస్త్రాన్ని కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు కుట్టి సిద్ధం చేశారు.అనంతరం సిద్ధం చేసిన యూనిఫాంలను విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా మహిళా సంఘాల మహిళలు ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై విద్యార్థుల కోసం యూనిఫాంలను తయారు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకం ద్వారా విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు అందడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ ఆసిఫ్ ఖాన్, 7వ వార్డు కౌన్సిలర్ కృష్ణం రాజు, కస్తూర్పల్లి సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్ తో పాటు మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పాదయాత్రను విజయవంతం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటి సురేష్ కుమార్
- పాదయాత్రకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్



**కొడంగల్, ఆగస్టు,11:** నేడు కోడంగల్ లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు, మంగళవారం కోడంగల్ లోని ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,, బుధవారం కోడంగల్ లో అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే సిపిఐ పాదయాత్రకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించే పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు,ప్రజలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద సిసి రోడ్డు, షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్ అగస్ట 11:** శంషాబాద్ మండల పరిధిలోని ఘాన్సీమియా గూడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా సిసి రోడ్డు, షెడ్డును పెద్ద షాపూర్ గ్రామ సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ తన సొంత నిధులతో నిర్మాణం చేశారు. నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్డు, షెడ్డును మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని లక్ష్యంతో సీసీ రోడ్డు షెడ్డు నిర్మాణం చేసిన సునీత సత్యనారాయణ గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తన్విరాజు, గణేష్ గుప్తా, చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, దేవాలయం కమిటీ అధ్యక్షుడు రాంనాథ్ ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, సహకార సంఘం చైర్మన్ దవణాకర్ గౌడ్, మాజీ సర్పంచులు దండు ఇస్తారి, దేవిక జగన్ గౌడ్, మాజీ ఎంపిటిసి యాదయ్య గౌడ్, సర్పంచులు కోటేష్ గౌడ్, రవి నాయక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రయాణికుల వద్ద వెండి నాణేలు Rosemary

**శంషాబాద్ అగస్టు 11:** శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి ఢిల్లీ వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద ఏడు కిలోల వెండి నాణేలను అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుండి ఢిల్లీ వెళ్తున్న ప్రయాణికులను తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ ప్రయాణికుడి వద్ద 7 కిలోల వెండి నాణేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాణ్యాలకు సంబంధించిన సరైన పత్రాలను సంబంధిత అధికారులకు ప్రయాణికుడు సూచించడంతో అతన్ని ఢిల్లీకి పంపించారు.

చురకలు



## హక్కుల కోసం గళం సరిపోదు.. బాధ్యత కోసం అడుగు ముందుకేయాలి!

- యువత రాజ్యాంగ విలువలను కాపాడాలి... వరంగల్ సీపీ ఎన్.శ్వేత
- నిన్నటి త్యాగాలే నేటి స్వేచ్ఛ.. రేపటి భవిష్యత్తు మన చేతుల్లోనే!
- యువత మేల్కొంటే.. దేశ భవిష్యత్తే మారుతుంది!
- జెండా ఎగరేయడం మాత్రమే కాదు.. దేశం కోసం నిలబడాలి!





**హనుమకొండ, ఆగస్టు 11 : :** రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు పౌరులుగా తమపై ఉన్న బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహిస్తున్న రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ఐసీఓపీ), ఫొటో ఎగ్జిబిషన్‌ను సీపీ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడటం ఒక వైపు మాత్రమేనని, అదే సమయంలో పౌరులుగా తమ బాధ్యతలను నిర్వర్తించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని, దాని విలువను కాపాడుతూ భవిష్యత్ తరాలకు బాధ్యతాయుతమైన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతి విద్యార్థి తన జీవితాన్ని ఏ విధంగా మలుచుకోవాలనేది పూర్తిగా తన చేతుల్లోనే ఉంటుందని అన్నారు. కష్టపడి పనిచేసి వ్యక్తిగత జీవితాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు దేశ ప్రగతిలోనూ భాగస్వాములు కావాలని సూచించారు.

### త్యాగాల చరిత్రను మరువొద్దు...

జాతీయ పతాక [illegible]తంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సీబీసీ వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా ప్రదర్శనలోని అంశాలను వివరించారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, దాని వెనుక ఉన్న త్యాగాలను భావితరాలు ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం అదృష్టమని, ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఒకటైన భారత రాజ్యాంగాన్ని వారసత్వంగా పొందడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా రాజ్యాంగం కల్పించిందని, స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు.కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశం పట్ల బాధ్యత, దేశభక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'హర్ ఘర్ తిరంగా'పై కళాబృందాలు ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీపీ ఎన్.శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి 'కాంపా' నిధులు మంజూరు చేయాలి

- అభివృద్ధి పనులకు నిధులు, ఎన్‌క్లోజర్లకు త్వరితగతిన అనుమతులివ్వాలి
- కేంద్ర జూ అథారిటీకి వరంగల్ ఎంపీ 'కడియం కావ్య' విజ్ఞప్తి
- CAMPA నిధులు, ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థ కోరిన ఎంపీ



**వరంగల్, ఆగస్టు 11 : :** కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి అవసరమైన CAMPA నిధులను మంజూరు చేయడంతో పాటు వివిధ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కేంద్ర జూ అథారిటీని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్‌తో పాటు హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు అవసరమైన సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటిని త్వరగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించాలని కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. CAMPA నిధులను విడుదల చేసి అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### జంతువుల కదలికలపై నిరంతర నిఘా...

జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పర్యవేక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా జంతువుల సంరక్షణ, భద్రతను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు.

### ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి...

కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా మెరుగుపడ తాయని తెలిపారు.ఎంపీ కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి

## పెంబర్తి కాంగ్రెస్ శ్రేణులకు 'ఇనగాల' దిశానిర్దేశం

- పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాల ప్రచారంపై కార్యాచరణ





**హసన్‌పర్తి/పెంబర్తి, ఆగస్టు 11 : :** గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్. అశోక్, ఇన్‌చార్జి ఈర్ల చిన్ని సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీకి పటిష్టమైన పునాది ఏర్పడేలా నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని పేర్కొన్నారు.నూతన కమిటీ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూతన కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మగౌరవానికి.. ఇందిరా మహిళా శక్తి అండ!





- ఆడపడుచుల ఆత్మగౌరవమే ప్రభుత్వ ప్రాధాన్యం!
- మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'

**వర్ధన్నపేట/ఆరెపల్లి, ఆగస్టు 11 : :** మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ప్రగతి పథంలో మరింత ముందుకు సాగుతుందని అన్నారు.మంగళవారం అరెపల్లిలోని వీకే గార్డెన్స్‌లో 3వ డివిజన్‌కు చెందిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తుచేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరల నాణ్యతపై మహిళల నుంచి అభ్యంతరాలు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ఉపయోగకరమైన చీరలను తయారు చేయించి అందిస్తోందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు అందిస్తున్న చీరలు ప్రభుత్వం తరపున అందించే గౌరవప్రదమైన కానుకగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళల సంక్షేమం, సాధికారతకు అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని కేఆర్ నాగరాజు తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు వారి సామాజిక స్థితిగతులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అరుణకర్, మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్ శిభారాణి, సొసైటీ చైర్మన్ బుద్దే పెద్దన్న, సీనియర్ నాయకులు అభిషేకం, సంపత్, సుధాకర్, రవికుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి మొక్క.. రేపటి తరాలకు ఊపిరి!.

- ఇంద్రానగర్‌లో వనమహోత్సవం.. మొక్కలు నాటిన నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి
- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**హన్మకొండ, ఆగస్టు 11 : :** నేడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే అమూల్యమైన కానుక అని నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడంపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 59వ డివిజన్ ఇంద్రానగర్‌లో ఇంద్రానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచనల మేరకు ఆయన సతీమణి నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా నీలిమా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో పచ్చదనం విస్తరించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం అందుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు.మొక్కలు నాటడానికే కార్యక్రమాన్ని పరిమితం చేయకుండా వాటి సంరక్షణకు కూడా బాధ్యత తీసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం ద్వారా వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దాలని కోరారు.ప్రజల భాగస్వామ్యంతో వరంగల్ నగరాన్ని మరింత పచ్చగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ ఇన్‌చార్జి కేతిడి దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వసంత్ మహేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు, కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, తెల్ల సుగుణ కిషోర్, శ్రీనివాస్‌రావు, నేహాల్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



చురకలు

బుధవారం 12.08.2026

# ఒకే వరుస.. కొలతల్లో తేడాలెందుకు?.

- ఆ నాలుగు షట్టర్లపై మమకారం ఎందుకు?
- మాదన్నపేట రోడ్డు వైడనింగ్‌లో 'కొలతల' గందరగోళం!
- మార్కింగ్‌లో వ్యత్యాసాలపై బాధితుల ఆవేదన... శాస్త్రీయ కొలతలతో న్యాయం చేయాలని విజ్ఞప్తి



**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 11 : :** మాదన్నపేట రోడ్డు వెడల్పు (రోడ్ వైడనింగ్) ప్రక్రియలో మార్కింగ్, కొలతల విషయంలో వ్యత్యాసాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక షాపు, భవన యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే వరుసలో నిర్మించిన షట్టర్లకు ఒకే విధమైన కొలతలు పాటించకుండా వేర్వేరు రీతుల్లో మార్కింగ్ చేయడం వల్ల కొందరు యజమానులకు అదనపు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు.స్థానిక సిటిజన్ క్లబ్ షట్టర్ల వద్ద ఒకే వరుసలో, ఒకే దారంతో నిర్మించిన 9 నుంచి 10 షట్టర్లకు బోర్డర్ కటింగ్ చేసినట్లు బాధితులు వివరించారు. అదే సమయంలో మరో నాలుగు షట్టర్లకు 2 నుంచి 3 అడుగుల మేర స్థలం వదిలి డ్రైనేజీ ఏర్పాటు చేసేలా మార్కింగ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఈ విధానం కారణంగా ఎదురుగా ఉన్న షట్టర్ల యజమానులకు అదనంగా సుమారు 2.5 అడుగుల మేర కటింగ్ పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

### అందరి సమక్షంలో మళ్లీ కొలతలు తీయాలి..

రోడ్డు విస్తరణ పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే కొలతలు, మార్కింగ్‌లో అందరికీ ఒకే విధమైన ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని బాధితులు స్పష్టం చేశారు. ప్రభావిత యజమానులందరినీ ఒకచోట సమావేశపరిచి, సంబంధిత అధికారులు శాస్త్రీయ పద్ధతిలో మరోసారి కొలతలు నిర్వహించాలని సూచించారు.వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎవరికీ అన్యాయం జరగకుండా పారదర్శక విధానంలో మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతున్నారు. ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా ప్రతి యజమానికి సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆశిస్తున్నారు.

### ఎమ్మెల్యే జోక్యంపై ఆశలు...

మాదన్నపేట రోడ్డు విస్తరణతో ప్రభావితమవుతున్న యజమానులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపాలని బాధితులు కోరుతున్నారు.మున్సిపల్ కమిషనర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అంశాన్ని పరిశీలించి, యజమానుల సమక్షంలో పారదర్శకంగా కొలతలు నిర్వహించాలని వారు అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా తుది మార్కింగ్ చేపట్టి, రోడ్డు విస్తరణతో ప్రభావితమయ్యే ప్రతి ఒక్కరికీ సముచిత న్యాయం జరిగేలా

# త్యాగాల తెలంగాణ.. ఉద్యమకారుల ఎదురుచూపులు!

- తెలంగాణ సాధనలో త్యాగాలు.. న్యాయం కోసం నేడు పోరాటాలు
- ఆగస్టు 15న సీఎం ప్రకటన చేయాలి...
- 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్

**హన్మకొండ, ఆగస్టు 11 : :** తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సహాయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సహాయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళోజీ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఉద్యమకారుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాయకులు సూచించారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించి, వారి




కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించే విధంగా సమగ్ర విధానం రూపొందించాలని కోరారు.ర్యాలీలో మహబూబాబాద్ పార్లమెంట్ టీఆర్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వీర బిక్షపతి, వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జి వెలిగేటి రవి, హనుమకొండ జిల్లా టీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ పర్లపల్లి

# నకిలీ టూరిస్ట్ వీసా తో మస్కట్ దేశానికి వెళ్లిన వరంగల్ మహిళ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో స్వస్థలానికి చేరుకున్న బాధ్యత మహిళా

**శంషాబాద్ అగస్టు 11:** నకిలీ వీసా తో జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లిన వరంగల్ కు చెందిన మహాముదా అనే మహిళ అక్కడ సబ్ ఏజెంట్ చిత్రహింసలకు గురిచేసి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు కొంతమంది సహకారంతో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకుపోయారు. దీంతో స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్ బాధ్యత మహిళా స్వదేశానికి



రావడం కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే మస్కట్లో ఉన్న బీఆర్ఎస్ నేతలతో మాట్లాడి మహిళను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడ బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని అక్కడి ఇండియన్ ఎంబసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడ పోలీసుల సహకారంతో ఆమె ఉన్న స్థలాన్ని కనుగొని అక్కడికి వెళ్లారు. అక్కడ ఉన్న సబ్ ఏజెంట్ తనకు ఇవ్వాల్సిన 1.23 లక్షల రూపాయలు ఇస్తేనే ఆమె పాస్పోర్ట్ ఇస్తానని లేనిచో ఇక్కడ జైలుకు పంపుతానని హెచ్చరించారు. ఆమెకు ఇవ్వాల్సిన డబ్బులను మాజీ మంత్రి కేటీఆర్ ఇవ్వడంతో అక్కడి సబ్ ఏజెంట్ కు డబ్బులు చెల్లించి అక్కడి నుండి సురక్షితంగా మంగళవారం శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు తీసుకువచ్చారు. శంషాబాద్ ఎయిర్పోర్టుకు సురక్షితంగా చేరుకున్న బాధితమైన మాట్లాడుతూ తను స్వదేశానికి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు

# ప్రతి గుండెలో దేశభక్తి.. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా!

- హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

**హనుమకొండ, ఆగస్టు 11 : :** దేశభక్తి ప్రతి భారతీయుడి గుండెల్లో నిండాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ పతాకానికి గౌరవం చాటాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్ర మంలో భాగంగా మంగళవారం హనుమకొం డలోని తన నివాసంపై కొండేటి శ్రీధర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతీయ పతాకం కేవలం మూడు రంగుల సమాహారం కాదని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ స్ఫూర్తిని నింపుతుందని అన్నారు.

### మువ్వన్నెల జెండా.. మన జాతీయ గౌరవానికి ప్రతీక...

దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని శ్రీధర్ కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కేవలం ఒక పండుగగా కాకుండా, దేశం కోసం ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకునే సందర్భంగా భావించాలని





సూచించారు."ముక్కోటి గొంతుకల ముక్తకంఠం.. మన జాతీయ జెండా. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి. త్రివర్ణ పతాకం మన శ్వాస.. దేశభక్తి మన ధ్యాస" అంటూ దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని ఇచ్చారు.దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. యువతలో దేశభక్తి భావాలను మరింత పెంపొందించడంతో పాటు దేశ అభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### ప్రతి ఇంటా జెండా.. ప్రతి మనసులో దేశభక్తి...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని కొండేటి శ్రీధర్ కోరారు. త్రివర్ణ పతాకం మనందరినీ ఒక్కటిగా నిలిపే జాతీయ భావానికి ప్రతీక అని, దేశం పట్ల గౌరవం ప్రతి పౌరుడి జీవితంలో భాగం కావాలని ఆకాంక్షించారు.'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో దేశభక్తిని ప్రతి ఇంటి నుంచి ప్రతి హృదయానికి తీసుకెళ్లాలని, మువ్వన్నెల జెండా ప్రతి ఇంటి ముంగిట గర్వంగా రెపరెపలాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణ నేల నుంచి బ్రిటన్ పార్లమెంట్ వరకు.. ఉదయ్ నాగరాజు ఘనత!

- హనుమకొండ వీధుల నుంచి హౌస్ ఆఫ్ లార్డ్స్ వరకు.. తెలంగాణ యువతకు స్ఫూర్తిదాయకం...
- తెలంగాణకు, వరంగల్–కరీంనగర్ ప్రాంతాలకు గర్వకారణం
- AI సాంకేతికతను యువతకు మరింత చేరువ చేయాలి... దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ, ఆగస్టు 11 : :** తెలంగాణ నేల నుంచి ఎదిగి బ్రిటన్ పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నియమితులైన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు తెలంగాణకు గర్వకారణమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాంనగర్‌లోని నిత్య బ్యాంకెట్ హాల్‌లో లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వినయ్ భాస్కర్ ఆయనను మెమొంటోతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్ నాగరాజుకు వరంగల్‌తో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం హనుమకొండ నక్కలగుట్టలో సాగిందని, అనంతరం హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో విద్యను కొనసాగించారని తెలిపారు. రాంటెక్ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసి, లండన్‌లోని ఆక్స్ఫర్డ్ బ్రూక్స్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించారని వివరించారు.

### తెలంగాణ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు...

47 ఏళ్ల వయస్సులోనే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు నియమితులైన తొలి వ్యక్తిగా ఉదయ్ నాగరాజు గుర్తింపు పొందడం విశేషమని వినయ్ భాస్కర్ కొనియాడారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి బ్రిటన్ పార్లమెంట్‌లో విశిష్ట స్థానాన్ని పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో ఉదయ్ నాగరాజు విశేష నైపుణ్యం సాధించారని, సాంకేతికత ద్వారా ప్రజలకు అందించిన సేవలకు లభించిన గుర్తింపుగా ఈ ఘనతను చూడవచ్చని అన్నారు.తెలంగాణ విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు AI సాంకేతికతను మరింత చేరువ చేసే దిశగా ఉదయ్ నాగరాజు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు.తెలంగాణ నేల నుంచి ఎదిగి ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపు సాధించిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజును గౌరవించుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ వికాస సమితి ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

**డీఎస్పీ నల్లపు లింగయ్య**




**నారాయణపేట, ఆగస్టు,11:**

నారాయణపేట రూరల్: మన ఊరు – మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ నల్లపు లింగయ్య లింగంపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ వాల్ ప్రాధాన్యతను డీఎస్పీ వివరించారు. ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతిభద్రతలు,చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధించిన సమాచారాన్ని చేరవేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ OTP, PIN, CVV, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియో గానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ–నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు గ్రామ ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. పోలీసులకు ప్రజలు సహకరిస్తే గ్రామాల్లో నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలి అని డీఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, లింగంపల్లి గ్రామ ప్రజలు, యువత మరియు తేదితరులు పాల్గొన్నారు.

# మన నేలపై మన పిల్లలకు కొలువులు రావాలి!

- మెగా టెక్స్‌టైల్ పార్క్ పురోగతిపై కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ కడియం కావ్య
- వరంగల్ యువత కలలకు.. టెక్స్‌టైల్ పార్క్ కొత్త ఆశ!
- ఉద్యోగాల కోసం బయటకు కాదు.. అవకాశాల కోసం వరంగల్‌కే యువత!
- యువత, మహిళలు, బలహీన వర్గాలకు ఉపాధిలో ప్రాధాన్యత ఇవ్వాలలి



**వరంగల్, ఆగస్టు 11::** వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న పీఎం మిత్ర (PM MITRA) మెగా టెక్స్‌టైల్ పార్క్ పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్క్ ద్వారా స్థానికంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఎంత మేరకు అందుబాటులోకి వస్తాయనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి ప్రారంభం, ఉద్యోగాల కల్పనకు సంబంధించిన పురోగతి వివరాలను వెల్లడించాలని కేంద్రాన్ని ప్రశ్నించారు. ముఖ్యంగా వరంగల్ ప్రాంతానికి చెందిన యువత, మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ఎన్ని ఉపాధి అవకాశాలు లభించనున్నాయో స్పష్టం చేయాలని కోరారు.ఎంపీ ప్రశ్నకు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లోక్‌సభలో సమాధానం ఇస్తూ దేశవ్యాప్తంగా ఏడు పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి వరంగల్‌ను ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వరంగల్‌లోని పార్క్‌ను బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీలో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### వేల కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన ప్రాజెక్ట్...

కేంద్ర సమాధానంపై డాక్టర్ కడియం కావ్య స్పందిస్తూ వరంగల్ పీఎం మిత్ర పార్క్‌ను కేవలం పారిశ్రామిక ప్రాజెక్టుగా కాకుండా తెలంగాణలోనే ప్రధాన పెట్టుబడులు, ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన వేగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వరంగల్ యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా స్థానికంగానే నాణ్యమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని కడియం కావ్య తెలిపారు. పార్క్ పరిధిలో నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### మహిళలు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత...

పీఎం మిత్ర పార్క్‌లో మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బలహీన వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎంపీ కోరారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు స్థానిక ప్రజలకు చేరినప్పుడే ఈ ప్రాజెక్ట్‌కు పూర్తి సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు.వరంగల్‌ను జాతీయ స్థాయి జౌళి రంగ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలను వరంగల్‌కు తీసుకురావడానికి పార్లమెంట్ వేదికగా తన ప్రయత్నాలను కొనసాగిస్తానని తెలిపారు.

# పెద్ది విగ్రహం విషయంలో రాజకీయం చేస్తున్నదెవరు?

- 'పెద్ది' సేవలు మరవలేరు.. అభిమానాన్ని అడ్డుకోలేరు.!
- నిబంధనలుంటే అధికారికంగా వెల్లడించాలి.. పత్రాలతో సమాధానం చెప్పాలి
- ప్రజల అభిమానాన్ని రాజకీయ కోణంలో చూడొద్దు... బీఆర్ఎస్ శ్రేణులు
- పెద్ది విగ్రహంపై ఆరోపణలు కాదు.. ఆధారాలు చూపాలి



**నర్సంపేట, ఆగస్టు 11 : :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుపై టీపీసీసీ సభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించేలా ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. ప్రజల అభిమానంతో, ఆయన చేసిన సేవలకు గుర్తుగా విగ్రహం ఏర్పాటు చేయాలనుకోవడాన్ని రాజకీయంగా చూడటం సరికాదని పేర్కొన్నాయి.విగ్రహం ఏర్పాటుకు అనుమతులపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారు ముందుగా ఏ అనుమతి అవసరమో, ఏ నిబంధన వర్తిస్తుందో, ఎక్కడ ఉల్లంఘన జరిగిందో అధికారిక పత్రాలతో ప్రజలకు వివరించాలని కోరారు. కేవలం రాజకీయ ఆరోపణలతో వాస్తవాలను మార్చలేరని స్పష్టం చేశారు.విగ్రహం రోడ్డుకు ఎంత దూరంలో ఉందనే అంశాన్ని రాజకీయ నాయకులు కాకుండా సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచించారు. అధికారికంగా కొలతలు తీసి నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు.గతంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అప్పట్లో ఏ నిబంధనలు అమలయ్యాయి, ఎలాంటి అనుమతులు ఇచ్చారనే వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలన్నారు.

### "శవరాజకీయాలు" వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి...

ప్రజల కోసం పనిచేసిన మాజీ ప్రజాప్రతినిధి మరణాన్ని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గౌరవిస్తూ విగ్రహం ఏర్పాటు చేయాలనుకోవడం ప్రజల్లో ఉన్న అభిమానానికి ప్రతీక అని తెలిపారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రాణాపాయంలో ఉన్న సమయంలో ప్రభుత్వం అందించిన వైద్య సహాయాన్ని రాజకీయ ప్రచారంగా ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ సహాయం అందించడం మానవత్వం, ప్రభుత్వ బాధ్యతలో భాగమన్నారు.నర్సంపేట ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని, విగ్రహం ఏర్పాటుపై ఉన్న ప్రజల ఆకాంక్షను రాజకీయ కుట్రగా చిత్రీకరించవద్దని సూచించారు. శాంతిభద్రతల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు చేయడం తగదన్నారు.

### చట్టానికి గౌరవం.. రాజకీయ కక్షకు వ్యతిరేకం...

నిబంధనలను పాటించడంలో బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే చట్టం పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు, అభ్యంతరాలు ఏవైనా ఉంటే అధికారికంగా తెలియజేస్తే వాటిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వ్యక్తిగత విమర్శలు, "శవరాజకీయాలు" వంటి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలు, ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని రాజకీయ ప్రకటనలతో చెరిపేయలేరని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# గుడిసె నుంచి గృహం వరకు... పేదల కలకు 'కడియం' భరోసా

- ప్రతీ బూత్‌కు 10 ఇందిరమ్మ ఇళ్లు.. 10 రోజుల్లో లబ్ధిదారుల జాబితా
- కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా... ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 : :** స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.రఘునాథపల్లి మండలం నీడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. రెండో విడత SIR ప్రక్రియలో రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించేలా శ్రద్ధ చూపాలన్నారు.ముసాయిదా ఓటరు జాబితాను బూత్‌ల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

### ప్రతి బూత్‌కు 10 ఇందిరమ్మ ఇళ్లు...

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రెండు విడతల్లో రూ.35 వేల కోట్లతో 7 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని 291 బూత్‌లకు ఒక్కో బూత్‌కు 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి వారి వివరాలను సేకరించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు 10 రోజుల్లో అందజేయాలని సూచించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

### ఆగస్టు 15 నుంచి డిజిటల్ రేషన్ కార్డులు...

ఆగస్టు 15 నుంచి డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుందని కడియం శ్రీహరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల కుటుంబాలకు డిజిటల్ రేషన్ కార్డులు అందించనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సర్పంచుల చేతుల మీదుగా కార్డుల పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### పార్టీ కోసం పనిచేసేవారికి ప్రాధాన్యం...

పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పుడే కాంగ్రెస్ మరింత పటిష్టంగా ఎదుగుతుందని కడియం శ్రీహరి పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారినే గ్రామ అధ్యక్షులుగా ఎన్నుకోవాలని సూచించారు. గ్రామస్తుల ఏకాభిప్రాయంతో అధ్యక్షుల ఎంపిక జరగాలని, ఏకాభిప్రాయం కుదరని ప్రాంతాల్లో రెండు లేదా మూడు పేర్లను జిల్లా కమిటీకి సిఫార్సు చేయాలని తెలిపారు.పార్టీలో వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఒకే పార్టీలో ఉంటూ పరస్పరం విమర్శించుకోవడం నియోజకవర్గంలో సహించబోనని స్పష్టం చేశారు. కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

### కాంగ్రెస్ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి...

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 2.50 లక్షల కొత్త పెన్షన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం దాదాపు రూ.1,600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం జరుగుతోందని వివరించారు.

### తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి...

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని కడియం శ్రీహరి ఆరోపించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే తిప్పికొట్టాలని సూచించారు. పార్టీకి నష్టం కలిగించేలా మనలో మనమే విమర్శించుకోవడం సరికాదని, వ్యక్తిగత భేదాభిప్రాయాలను పక్కనపెట్టి కాంగ్రెస్ కుటుంబంగా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ప్రతి ఎన్నికలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరేయడమే తన ఏకైక లక్ష్యమని కడియం శ్రీహరి పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన అవకాశాలు లభిస్తాయని, కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో SIR వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శశిరీష్ రెడ్డి, SIR నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల జగదీష్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు





# పుస్తకాల్లో పాఠాలతో పాటు.. జీవిత పాఠాలూ నేర్చుకోవాలి

- కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి
- చదువు ఒక్కటే కాదు.. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యమూ కావాలి!
- విద్యార్థులకు చట్టాలు, మహిళా సాధికారతపై అవగాహన
- నైపుణ్యాలతోనే సవాళ్లను ఎదుర్కునే శక్తి...విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచిన అనితా రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 11 : :** విద్యార్థులకు విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, చట్టాలు, మహిళా సాధికారత, యాంటీ ర్యాగింగ్ అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ బిక్షాలు ఆధ్వర్యంలో మంగళ వారం లైఫ్ స్కిల్స్, ఉమెన్ ఎంపవర్‌మెంట్, చట్టాలు, యాంటీ ర్యాగింగ్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అనితా రెడ్డి, ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటిం చారు.కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు విద్యా నైపుణ్యాలతో పాటు జీవిత విలువలు, బాధ్యతా యుత ప్రవర్తన, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించే వాతావరణం అవసరమని ఆమె సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు మంచి నడవడికను అలవరుచుకుని, జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

### సమస్యలను ఎదుర్కొనే ధైర్యమే సాధికారత...

మహిళా సాధికారత అంటే కేవలం విద్య, ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాదని, తమ సమస్యలను తాము పరిష్కరించుకునే స్థాయికి ఎదగడంతో పాటు ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడమని వివరించారు. చిన్నచిన్న సమస్యలకు భయపడి ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాల వైపు వెళ్లకుండా, సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ చట్టాలు, వ్యక్తిగత భద్రత, బాధ్యతాయుత ప్రవర్తన, సామాజిక అంశాలపై సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పరస్పర గౌరవాన్ని పాటించాలని సూచించారు.

### ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు...

తోటి విద్యార్థులను మానసికంగా, శారీరకంగా లేదా భావోద్వేగపరంగా వేధించడం కూడా ర్యాగింగ్ పరిధిలోకి వస్తుందని డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీతో పాటు పోష్ (POSH) ఇంటర్నల్ కమిటీలను సమర్థంగా ఏర్పాటు చేసి, విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో పాటు తన దృష్టికి కూడా తీసుకురావచ్చని విద్యార్థులకు భరోసా కల్పించారు.

### చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్చుకోవాలి...

ప్రేమ పేరుతో భావోద్వేగ నిర్ణయాలు తీసుకుని ఎంతో మంది తమ భవిష్యత్తును నష్టపరుచుకుంటున్నారని పేర్కొంటూ, విద్యార్థులు చదువు, లక్ష్యం, భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. చదువుతో పాటు జీవిత పాఠాలు కూడా నేర్చుకోవాలన్నారు. డాక్టర్ అనితా రెడ్డి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సందేహాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిక్షాలు, ప్రొఫెసర్లు,



# క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతి..

## ఇకపై 40 శాతం మరణాలు నివారించవచ్చు

ప్రపంచ వ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడేవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దీనికి ప్రధాన కారణం చివరి దశలో ఈ క్యాన్సర్ గుర్తించడమే. అయితే తాజా పరిశోధనలు ఈ క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతిని కనుగొన్నారు. దీని ద్వారా 40 శాతం మరణాలను అడ్డుకోవచ్చంటున్నారు పరిశోధకులు.. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రొమ్ము క్యాన్సర్ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక సంఖ్యలో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుయి. మరణాల పరంగా రొమ్ము క్యాన్సర్ కంటే గర్భాశయ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా దాదాపు 4 లక్షల మంది మహిళలు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ కేసుల్లో చాలా వరకు చివరి దశలో అభివృద్ధి చెందుతాయి. ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది. దీంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పరిశోధకుల రీసెర్చ్ ఈ వ్యాధి చికిత్సలో గొప్ప విజయాన్ని సాధించారు. ఈ చికిత్సతో సర్వైకల్ క్యాన్సర్ మరణాలను 40 శాతం తగ్గించవచ్చని అంటున్నారు.



### ఈ కొత్త టెక్నాలజీతో సర్వైకల్ క్యాన్సర్ చికిత్స...

పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ కేసుల దృష్ట్యా.. వైద్యులు మెరుగైన చికిత్సను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. సంవత్సరాలుగా దానిపై అధ్యయనాలు చేస్తున్నారు. ఇటీవల వైద్యులు దాని చికిత్సలో సానుకూల ఫలితాలను పొందారు. ఈ పరిశోధనకు యూకే, మెక్సికో, భారత్, ఇటలీ, బ్రెజిల్‌లతో సహా 10 సంవత్సరాలకు పైగా ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలను తీసుకున్నారు. ఈ చికిత్సలో కెమోరేడియేషన్‌కు ముందు కీమోథెరపీని చిన్న సెషన్‌లు ఇచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ నేతృత్వంలోని ఈ పరిశోధన మూడవ, నాల్గవ దశ క్యాన్సర్ చికిత్సలో చాలా మంచి ఫలితాలను చూపించింది. ఫలితంగా ఈ వ్యాధి నుండి మరణించే ప్రమాదాన్ని 40 శాతం తగ్గించవచ్చని తేలింది. పైగా ఈ క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం 35 శాతం తగ్గింది కూడా. మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన ఫేజ్ 3 ట్రయల్‌లో విజయవంతమైనట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త చికిత్స విధానంపై పెద్ద ఎత్తున పరిశోధన చేయనప్పటికీ, ఈ పరిశోధన ఫలితాలు గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో గొప్ప విజయంగా భావిస్తున్నారు.



### ప్రతి ఏడాది 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల్లో సగానికి పైగా మరణిస్తున్నారు. దీని బారిన పడిన స్త్రీలలో చాలా మంది దాదాపు 50 సంవత్సరాల వయస్సు గలవారు ఉంటున్నారు. 30 నుండి 40 శాతం కేసులలో ఈ క్యాన్సర్ నయమైన తర్వాత మళ్లీ తిరిగి వస్తుంది. రెండో సారి తిరగబెట్టినప్పుడు ఇది మరింత ప్రాణాంతకంగా మారి మరణానికి కారణమవుతుంది. గర్భాశయ క్యాన్సర్‌లో మరణాల సంఖ్య పెరగడానికి కారణం ఆలస్యంగా గుర్తించడమే. చాలామంది మహిళలు నాల్గవ దశలో ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆధునాతన చికిత్సను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించి, చికిత్స చేసేందుకు సాధ్యమవుతుంది . తద్వారా మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### గర్భాశయ క్యాన్సర్‌ను ఎలా నివారించాలి...

- △ ధూమపానం మానుకోవాలి
- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉండటం
- △ చిన్నవయసులోనే శారీరక సంబంధాలు పెట్టుకోకపోవడం మంచిది
- △ గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా తీసుకోకూడదు
- △ సర్వైకల్ క్యాన్సర్‌ను పరీక్షించడానికి ఎప్పటికప్పుడు పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి
- △ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేయించుకోవాలి



### గర్భాశయ క్యాన్సర్ ఎందుకు వస్తుంది...?

- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలను కలిగి ఉండటం
- △ ధూమపానం
- △ గర్భనిరోధక మాత్రలు అధికంగా తీసుకోవడం కలిగి ఉండటం

## వెన్నునొప్పితో బాధపడుతున్నారా?

# ఇలా చేస్తే ఉపశమనమే..



ప్రస్తుత రోజుల్లో చాలామంది ఒకే చోట కదలకుండా గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటారు. దీని వల్ల వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను ఇలాగే వదిలేస్తే అనతి కాలంలోనే సమస్య తీవ్రం అవుతుంది. ఇలా అవకుండా ఉండాలంటే.. గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వెన్నుపాము నొప్పి రావడం సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్య ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుంది. కానీ కొంతమందిలో ఇది చాలా కాలం పాటు కొనసాగుతుంది. దీనివల్ల ఏ పని చేయాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. చాలా మంది వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వెన్నెముక కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా హెర్నియేటెడ్ డిస్క్, వెన్నునొప్పి, పార్శ్వగూని వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని ఢిల్లీలోని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్‌లో వెన్నెముక సేవల చీఫ్ డాక్టర్ వికాస్ టాండన్ అంటున్నారు. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, కీళ్లనొప్పులు, వెన్నుపాము దెబ్బతినడానికి కూడా దారితీయవచ్చు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ చిరోప్రాక్టిక్ ద్వారా అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని జరుపుకుంటామని డాక్టర్ వికాస్ టాండన్ వివరించారు. ఇది 2008లో ప్రారంభమైంది. వెన్నెముకకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశం. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, చెడు భంగిమ, బలహీనమైన జీవనశైలి, గాయం వెన్నెముకలో నొప్పికి కారణమవుతుందని డాక్టర్ వికాస్ వివరిస్తున్నారు. ఈ నొప్పి ప్రారంభంలో స్వల్పంగా ఉంటుంది. తరువాత క్రమంగా పెరుగుతుంది. కానీ దానిని విస్మరించకూడదు. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే మంచి భంగిమలో కూర్చోవాలి. లేవడం, కూర్చోవడం, నడిచే విధానం సరిగ్గా ఉండాలి. సరిగ్గా కూర్చోవడం మన మెదడుపై అనేక విధాలుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది వెన్నెముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నిటారుగా కూర్చోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. నిటారుగా కూర్చుంటే శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జీవనశైలిని చక్కగా ఉంచుకోవాలి. ప్రతిరోజు యోగా చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని చేర్చుకోవాలి.

# గర్భిణీలు స్మోకింగ్ చేస్తే.. అతి ప్రమాదకరం

పొగతాగడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు స్మోకింగ్ ప్రధాన కారణం. అందుకే ఈ అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలు మొదలు ఎముకలు, మెదడు ఆరోగ్యంపై కూడా స్మోకింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే గర్భిణీలు ఒకవేళ స్మోకింగ్ చేస్తే మరింత ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మోకింగ్ వల్ల గర్భిణులకు తీవ్ర అనర్థాలు తప్పవని అంటున్నారు. సిగరెట్ పొగలో ఏకంగా నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి.



సాధారణంగా స్మోకింగ్ చేసే వారిలో ఈ రసాయనాలు రక్తంలో కలిసిపోతాయి. దీంతో ఈ రసాయనాలు ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. ఇది శిశువు ఎగుదలకు, మానసిక అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని అధ్యయనంలో తేలింది. అంతేకాకుండా స్మోకింగ్ చేయడం వల్ల గర్భిణీ హృదయ స్పందనల రేటుపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో డెలివరీ సమయంలో తల్లి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

అయితే గర్భం దాల్చకముందు సిగరెట్ అలవాటు ఉండి. గర్భం దాల్చిన తర్వాత మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశం 27 శాతం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో కూడా స్మోకింగ్ చేస్తే ఈ ముప్పు 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వేలో తేలింది. గర్భిణీలు స్మోకింగ్ చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కచ్చితంగా నేరుగా ప్రమాదం పడుతుందని, తల్లి కావాలనుకునే వారు కనీసం 6 నెలల ముందు నుంచి ఈ అలవాటును మానేయడం ఉత్తమం అని చెబుతున్నారు.



# తెలంగాణ తొలి శతావధాని..

# శిరశినగల్ కృష్ణమాచార్యులు

**నేడు శిరశినగల్ కృష్ణమాచార్యులు జయంతి**

**అవధాన విద్యలో తెలంగాణకు తొలి కీర్తిపతాక**

**సంస్కృతాంధ్రాల్లో 40కి పైగా గ్రంథాల రచన**

**'అభినవ కాళిదాసు'గా సాహితీ లోకంలో ఖ్యాతి**

**కవిగా.. పండితుడిగా.. గురువుగా చెరగని ముద్ర**

తెలంగాణ సాహితీ చరిత్రలో అవధాన విద్యకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మహాపండితుడు శిరశినగల్ కృష్ణమాచార్యులు. 'అభినవ కాళిదాసు', 'నైజాం రాష్ట్రాద్య శతావధాని', 'పండితరత్న', 'ఉభయ వేదాంత విద్వాన్', 'ఉభయ వేదాంతాచార్య' వంటి బిరుదులతో సాహితీ లోకంలో విశేష కీర్తి పొందారు. కోరుట్ల కృష్ణమాచార్యులుగా కూడా ప్రసిద్ధి చెందిన ఆయన తెలంగాణ ప్రాంత తొలి శతావధానిగా గుర్తింపు పొందారు. కృష్ణమాచార్యులు 1905 ఆగస్టు 12న నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్‌లో రంగమ్మ, వేంకటాచార్య దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచిన ఆయన పితామహుడు సింగరాచార్యులు, తండ్రి వేంకటాచార్యుల వద్ద ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. అనంతరం మాతామహుడు గోవిందాచార్యుల వద్ద 1914 నుంచి 1921 వరకు కావ్య, నాటక, అలంకార సాహిత్యంతో పాటు తిరుమంత్రార్థం, శ్రీవచన భూషణ వ్యాఖ్యానం తదితర గ్రంథాలను అధ్యయనం చేశారు. తర్వాత వల్లంకొండలో కనకాపురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందోర్భుల వెంకన్న వద్ద సిద్ధాంత భాగం, పితాపురంలో గుదిమెళ్ల రంగాచార్యుల వద్ద వేదాంతాన్ని అభ్యసించారు. ఇలా సాహిత్యం, తర్కం, వేదాంతం వంటి విభిన్న శాస్త్రాల్లో విశేష పాండిత్యాన్ని సంపాదించారు. 1926లో కోరుట్లలోని ఉభయ వేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఆయన తన అధ్యాపక ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. చివరకు కోరుట్లలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ చేశారు. తన సుదీర్ఘ అధ్యాపక జీవితంలో ఎంతోమంది విద్యార్థులకు సంస్కృత సాహిత్యం, వేదాంత విద్యను బోధించి పండితులుగా తీర్చిదిద్దారు.

## నలభైకి పైగా రచనలు

సంస్కృతాంధ్ర భాషల్లో కృష్ణమాచార్యులు 40కి పైగా గ్రంథాలు రచించారు. కావ్యాలు, శతకాలు, సుప్రభాతాలు, స్తుతిగీతాలు, హరికథలు తదితర ప్రక్రియల్లో ఆయన కలం సాగింది. 'కళాశాల అభ్యుదయం', 'రామానుజ చరితం', 'చిత్రప్రబంధ రత్నమాల', 'మనస్సందేశ కావ్యము', 'సంపత్కుమార సంభవ కావ్యము', 'గాంధీతాత నీతిశతకము', 'గీతాచార్య మతప్రభావ శతకము' ఆయన రచనల్లో ముఖ్యమైనవి. వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతం, వేణుగోపాలస్వామి సుప్రభాతం, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతంతో పాటు 'పద్మావతీ పరిణయము', 'రుక్మిణీ కల్యాణము' వంటి హరికథలను రచించారు. 'విశిష్టాద్వైతమత సంగ్రహము', 'వేదార్థ సంగ్రహము', 'గురువంశ కావ్యనిధి' వంటి రచనలతో తన వేదాంత పాండిత్యాన్ని చాటారు. 'స్వీయ కవితానుజీవనం' పేరుతో తన జీవిత విశేషాలను కూడా అక్షరబద్ధం చేశారు.

## అవధానంలో అపూర్వ ప్రతిభ

కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి తదితర ప్రాంతాల్లో అష్టావధానాలు, శతావధానాలు నిర్వహించి కృష్ణమాచార్యులు తన అసాధారణ ధారణాశక్తిని ప్రదర్శించారు. తెలంగాణ ప్రాంతంలో తొలి శతావధానిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన ప్రతిభకు మెచ్చి సాహితీ ప్రపంచం 'నైజాం రాష్ట్రాద్య శతావధాని', 'పండితరత్న', 'ఉభయ వేదాంత విద్వాన్', 'ఉభయ వేదాంతాచార్య' వంటి బిరుదులతో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, ఢిల్లీలో జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలతో పాటు తొలి ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ కృష్ణమాచార్యులు ఘన సత్కారాలు అందుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఆయనను సత్కరించారు. కృష్ణమాచార్యుల సాహితీ కృషిపై కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో పలువురు పరిశోధకులు పరిశోధనలు చేసి పీహెచ్‌డీలు పొందడం ఆయన రచనల ప్రామాణికతకు నిదర్శనం. తెలుగు, సంస్కృత సాహిత్యాలకు జీవితాన్ని అంకితం చేసి, అవధాన విద్యలో తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టిన శిరశినగల్ కృష్ణమాచార్యులు సాహితీ లోకంలో చిరస్మరణీయులు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహాపండితుడి సాహితీ సేవలను స్మరించుకోవడం తెలుగు భాషకు ఇచ్చే గౌరవమే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి

**నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం**



భారత దేశంలో అకడమిక్ లైబ్రరీలతోపాటు, పబ్లిక్ లైబ్రరీలలో అభివృద్ధికి, గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించి దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. లెక్కల ప్రొఫెసరైన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ 1923లో మద్రాసు యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా చేరాడు. తనకు దొరికిన ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని గ్రంథాలయ వ్యవస్థకు సంబంధించిన ప్రపంచవ్యాప్త ధోరణులను పరిశీలించి, 1924లో క్లాసిఫికేషన్, 1933లో గ్రంథాలయ కేటలాగుల్ని తయారు చేయడానికి ఒక కొత్త కోడ్‌ను రూపొందించాడు. కోలన్ క్లాసిఫికేషన్ అని పిలిచే ఈ వర్గీకరణ పద్ధతిని దేశంలోని అనేక గ్రంథాలయాలు అనుసరిస్తున్నాయి. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణం గానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉ పనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# గజరాజులే అడవికి ప్రాణం..

# వాటి రక్షణే ప్రకృతికి శ్రీరామరక్ష

**నేడు ప్రపంచ ఏనుగుల దినోత్సవం**



**భారతీయ సంస్కృతిలో ఏనుగుకు విశిష్టమైన స్థానం ఉంది. జ్ఞానం, శక్తి, శాంతి, దయకు ప్రతీకగా గజరాజును ఆరాధిస్తాం. విఘ్నాలను తొలగించే వినాయకుడిని గజాననుడిగా కొలుస్తాం. పురాణాల నుంచి పర్యావరణం వరకు మన జీవన విధానంతో విడదీయరాని అనుబంధం కలిగిన ఏనుగుల సంరక్షణ అవసరాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 12న ప్రపంచ ఏనుగుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

2012లో కెనడాకు చెందిన సినీ నిర్మాత పట్రిషియా సిమ్స్, థాయ్‌లాండ్‌కు చెందిన ఏనుగు సంరక్షణ సంస్థ చొరవతో ప్రపంచ ఏనుగుల దినోత్సవం ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రభుత్వాలు, వన్యప్రాణి సంరక్షణ సంస్థలు, పర్యావరణవేత్తలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజాలు ఏనుగుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

## అడవికి గజరాజే ఇంజినీర్

ఏనుగులు కేవలం భారీ వన్యప్రాణులు మాత్రమే కాదు. అడవుల మనుగడలో వాటిది అత్యంత కీలకమైన పాత్ర. అందుకే పర్యావరణ శాస్త్రవేత్తలు ఏనుగులను కీలక జీవజాతుల్లో ఒకటిగా పరిగణిస్తారు. అడవుల్లో సంచరిస్తూ విత్తనాలను సుదూర ప్రాంతాలకు వ్యాప్తి చేస్తాయి. నీటి కోసం నేలను తవ్వుతూ ఇతర వన్యప్రాణులకు కూడా నీటి వనరులను అందుబాటులోకి తెస్తాయి. దట్టమైన అరణ్యాల్లో దారులను సృష్టిస్తాయి. గడ్డి మైదానాల పునరుజ్జీవనానికీ తోడ్పడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఏనుగు అడుగుజాడల్లోనే అనేక జీవులకు జీవన మార్గం ఏర్పడుతుంది.

## సంస్కృతిలోనూ ప్రత్యేక స్థానం

భారతీయ సంప్రదాయంలో ఏనుగు జ్ఞానం, శక్తి, సౌభాగ్యం, పరాక్రమానికి ప్రతీక. పురాణాలు, ఇతిహాసాల్లో గజరాజులకు విశిష్టమైన స్థానం కనిపిస్తుంది. భాగవతంలోని 'గజేంద్ర మోక్షం' కథ భక్తి, ధర్మం, రక్షణకు ప్రతీకగా తరతరాలుగా ప్రజల్లో నిలిచిపోయింది. వినాయకుడి రూపంలో గజముఖాన్ని ఆరాధించడం భారతీయులకు ఏనుగులతో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధానికి నిదర్శనం.

## మనుగడకు పొంచి ఉన్న ముప్పులు

ప్రపంచవ్యాప్తంగా ఆఫ్రికన్, ఆసియా ఏనుగులు ప్రధానంగా కనిపిస్తాయి. అయితే దంతాల కోసం అక్రమ వేట, అడవుల విధ్వంసం, ఆవాసాల విచ్ఛిన్నం, మానవ-ఏనుగు ఘర్షణలు, వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సమస్యలు వాటి మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నాయి. అరణ్య ప్రాంతాల్లో మానవ కార్యకలాపాలు విస్తరించడంతో సంప్రదాయ ఏనుగు కారిడార్లు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏనుగులు జనావాసాలు, పంట పొలాల్లోకి ప్రవేశించడం.. అక్కడ ఘర్షణలు చోటుచేసుకోవడం తీవ్రమైన సమస్యగా మారుతోంది.

## భారత్‌కు మరింత బాధ్యత

ఆసియా ఏనుగుల ప్రధాన ఆవాస దేశాల్లో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అందువల్ల గజరాజుల సంరక్షణలో భారత్‌పై మరింత బాధ్యత ఉంది. అడవి ఏనుగుల సంరక్షణ, వాటి సహజ ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణ, అక్రమ వేట నియంత్రణ, మానవ-ఏనుగు ఘర్షణల నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 1992లో లి'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'లిలిను ప్రారంభించింది. ఏనుగులు స్వేచ్ఛగా సంచరించే మార్గాలను కాపాడటం ఈ ప్రయత్నాల్లో అత్యంత కీలకం.

## గజరాజును కాపాడితే.. అడవిని

ఏనుగుల పరిరక్షణ అంటే ఒక్క జీవజాతిని కాపాడటం మాత్రమే కాదు. వాటిపై ఆధారపడిన మొత్తం జీవావరణ వ్యవస్థను రక్షించడం. అడవులు నిలవాలంటే వాటిలోని జీవవైవిధ్యం నిలవాలి. ఆ జీవవైవిధ్యానికి గజరాజులు ప్రధాన ఆధారం. అందుకే ఏనుగుల సహజ ఆవాసాలను కాపాడటం, అక్రమ దంతాల వ్యాపారాన్ని అరికట్టడం, ఏనుగు కారిడార్లలో ఆక్రమణలను నిరోధించడం, మానవ-ఏనుగు ఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనడం అత్యవసరం.

**గజరాజుల రక్షణే అడవుల రక్షణ.. అడవుల రక్షణే పర్యావరణ పరిరక్షణ. ఈ భావన ప్రతి ఒక్కరిలో పెరిగినప్పుడే భవిష్యత్ తరాలకు గజరాజుల ఘీంకారాన్ని, పచ్చని అడవులను వారసత్వంగా అందించగలం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రపంచాన్ని ఏలిన విండీస్‌కు.. ఇప్పుడు బెర్త్ కోసం అగ్నిపరీక్ష!

- ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం
- రెండుసార్లు ప్రపంచకప్ విజేతకు ఇప్పుడు క్వాలిఫయర్స్ గండం
- నేరుగా అర్హత అవకాశాలకు అఫ్గానిస్థాన్ గండి
- ప్రపంచకప్ చేరాలంటే సుదీర్ఘ క్వాలిఫయింగ్ పోరు
- కరేబియన్ దిగ్గజాలు గట్టెక్కుతారా?.. మళ్లీ నిరాశేనా?



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏకచక్రాధిపత్యంతో ఏలిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి ఇప్పుడు ప్రపంచకప్ బెర్త్ కోసం పాకులాడే స్థాయికి చేరింది. రెండుసార్లు వన్డే ప్రపంచకప్, రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన కరేబియన్ జట్టు.. వచ్చే ఏడాది జరిగే 50 ఓవర్ల ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు నాటికి ర్యాంకింగ్స్‌లో అర్హత స్థానాల్లో నిలిచే జట్లకు నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కుతుంది. అయితే ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ విజయంతో పుంజుకోవడం వెస్టిండీస్ అవకాశాలను దెబ్బతీసింది. దీంతో కరేబియన్ జట్టు ఇప్పుడు ప్రపంచకప్‌కు చేరాలంటే కఠినమైన క్వాలిఫయింగ్ ప్రక్రియను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం కూడా వెస్టిండీస్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. క్వాలిఫయర్స్‌లో విఫలమై సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయింది. ఆ పరాభవం కారణంగా తర్వాతి ఛాంపియన్స్ ట్రోఫీ అవకాశాన్నీ కోల్పోయింది. ఇప్పుడు మరోసారి అదే ప్రమాదం కరేబియన్ జట్టును వెంటాడుతోంది. ప్రపంచకప్ బెర్త్ సాధించాలంటే వెస్టిండీస్ సుదీర్ఘమైన అర్హత పోరును దాటాల్సి ఉంటుంది. ప్రధాన క్వాలిఫయర్‌లో అగ్రస్థానాల్లో నిలవడంతో పాటు తదుపరి దశల్లోనూ నిలకడగా రాణించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడలా నిలిచిన జట్టు.. ఇప్పుడు తానే ప్రపంచకప్‌లో చోటు కోసం పోరాడాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది. వివియన్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గార్డన్ గ్రీనిడ్జ్, మైఖేల్ హోల్డింగ్ వంటి దిగ్గజాలతో ప్రపంచ క్రికెట్‌ను వణికించిన వెస్టిండీస్.. మళ్లీ ఆ వైభవాన్ని అందుకుంటుందా? కఠినమైన అర్హత పోరును దాటి ప్రపంచకప్ వేదికపై అడుగుపెడుతుందా? లేక మరోసారి మెగా టోర్నీకి ప్రేక్షకపాత్రకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## పసికూనకు ప్రపంచకప్ బెర్త్.. రెండుసార్లు ఛాంపియన్‌కు బిగ్ షాక్!

### 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అఫ్గానిస్థాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా ప్రస్థానం ప్రారంభించి సంచలన విజయాలతో దిగ్గజ జట్లకు సవాల్ విసురుతున్న అఫ్గానిస్థాన్ మరో ఘనత సాధించింది. 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో మూడు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో మెగా టోర్నీలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏలిన రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈ పరిణామం భారీ షాక్‌గా మారింది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన రషీద్.. బ్యాటింగ్‌లో కీలక సమయంలో 43 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో అతడికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఐదు వన్డేల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లోనే అఫ్గానిస్థాన్ తన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటింది. ఆ టోర్నీలో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి బలమైన జట్లను మట్టికరిపించి సంచలనం సృష్టించింది. రషీద్ ఖాన్ వంటి అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లు రాణిస్తుండటంతో 2027 ప్రపంచకప్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో అఫ్గాన్ ఉంది.



**విండీస్‌కు అఫ్గాన్ దెబ్బ**

అఫ్గానిస్థాన్ విజయం వెస్టిండీస్ ఆశలపై నీళ్లు చల్లింది.

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన కరేబియన్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. గత ప్రపంచకప్‌నకు కూడా నేరుగా అర్హత పొందలేకపోయిన వెస్టిండీస్.. క్వాలిఫయర్స్‌లోనూ విఫలమై తొలిసారిగా మెగా టోర్నీకి దూరమైంది. ఇప్పుడు మరోసారి అదే కఠిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించేందుకు సెప్టెంబర్ 30ను గడువుగా నిర్ణయించారు. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు ఆటోమేటిక్ బెర్త్ లభిస్తుంది. మిగిలిన స్థానాలకు ర్యాంకింగ్స్ కీలకం కానున్నాయి. ఐర్లాండ్‌పై విజయంతో అఫ్గానిస్థాన్ తన స్థానాన్ని పదిలం చేసుకోవడంతో వెస్టిండీస్‌కు నేరుగా ప్రపంచకప్ చేరే మార్గం మూసుకుపోయింది. కటాఫ్ తేదీకి ముందు వెస్టిండీస్‌కు మరో రెండు వన్డేలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిలో గెలిచినా అఫ్గానిస్థాన్‌ను వెనక్కినెట్టి నేరుగా అర్హత సాధించే అవకాశం లేదన్న సమీకరణాలు కరేబియన్ జట్టును కలవరపెడుతున్నాయి.

#### క్వాలిఫయర్సే దిక్కు!

ఇక వెస్టిండీస్ ప్రపంచకప్‌లో ఆడాలంటే క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాల్సిందే. 10 జట్లతో జరిగే అర్హత టోర్నీలో కీలక విజయాలు సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడగా నిలిచిన రెండుసార్లు ఛాంపియన్.. ఇప్పుడు పసికూనగా మొదలైన అఫ్గానిస్థాన్ నేరుగా బెర్త్ కొట్టేస్తుంటే తాను మాత్రం క్వాలిఫయర్స్ బాట పట్టాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది.

## 29 టెస్టులు.. 29 మైదానాలు!

- ఇదెక్కడి వింత రికార్డు జైస్వాల్!
- ఆడిన ప్రతీ టెస్టుకూ కొత్త వేదికే
- ఒక్క మైదానంలోనూ రెండోసారి ఆడని ఓపెనర్
- గాల్‌లో 30వ టెస్టుతో అరుదైన ఘనతకు అడుగు
- 29 టెస్టుల్లో 2,535 పరుగులు.. ఏడు శతకాలు
- శ్రీలంక సిరీస్‌లో జైస్వాల్‌పైనే అందరి చూపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో బ్యాటుతో పరుగుల వరద పారించడమే కాదు.. ఓ విచిత్రమైన రికార్డుతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పటివరకు కెరీర్‌లో 29 టెస్టులు ఆడిన జైస్వాల్.. ఆ 29 మ్యాచ్‌లనూ 29 వేర్వేరు వేదికల్లో ఆడటం విశేషం. ఒక్క మైదానం కూడా పునరావృతం కాకపోవడం ఈ రికార్డును మరింత ఆసక్తికరంగా మార్చింది. 2023లో వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఆ తర్వాత భారత జట్టులో రెగ్యులర్ ఓపెనర్‌గా స్థానం సుస్థిరం చేసుకున్నాడు. స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుసగా అవకాశాలు అందుకున్నా.. ప్రతి టెస్టుకూ వేదిక మారుతూ వచ్చింది. అలా 29 టెస్టులు పూర్తయ్యేసరికి 29 వేర్వేరు మైదానాల్లో ఆడిన అరుదైన ఘనత అతడి ఖాతాలో చేరింది. ఇప్పుడు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో జైస్వాల్ మరో ఆసక్తికర మైలురాయి అందుకోనున్నాడు. ఆగస్టు 15 నుంచి గాల్‌లో జరిగే తొలి టెస్టు అతడి కెరీర్‌లో 30వది కానుంది. గాల్‌లోనూ జైస్వాల్‌కు ఇదే తొలి టెస్టు కావడంతో '30 టెస్టులు.. 30 వేదికలు' అనే అరుదైన రికార్డు కొనసాగనుంది. జైస్వాల్ ఇప్పటివరకు 29 టెస్టుల్లోని 54 ఇన్నింగ్స్‌లలో 48.75 సగటుతో 2,535 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలు, 13 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 214 పరుగులు కాగా.. రెండు ద్విశతకాలు కూడా అతడి ఖాతాలో ఉన్నాయి. 317 ఫోర్లు, 45 సిక్సర్లతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన దూకుడు చూపిస్తున్నాడు. జూన్‌లో అఫ్గానిస్థాన్‌పై తన 29వ టెస్టు ఆడిన జైస్వాల్.. ఇప్పుడు శ్రీలంక గడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి. గాల్ తర్వాత కొలంబో కూడా అతడికి కొత్త వేదిక కావడంతో ఈ విచిత్రమైన రికార్డు మరింత ముందుకు సాగే అవకాశముంది.



## చైనా గడ్డపై శ్రేయాషి చరిత్ర

### అంతర్జాతీయ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం

### ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు

**న్యూ ఢిల్లీ:** భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి చరిత్ర సృష్టించింది. చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించిన సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషుయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇప్పటికే స్వర్ణ పతకాలతో తన ప్రతిభను చాటుకున్న శ్రేయాషి.. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లోనూ పతకం సాధించి భారత కీర్తిపతాకను రెపరెపలాడించింది. క్లాసిక్ స్లాలోమ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి కాంస్యాన్ని అందుకుంది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషికి చిన్నతనం నుంచే స్కేటింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. మూడేళ్ల వయసులోనే తన సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ప్రారంభించింది. ఆరేళ్లు వచ్చేసరికి జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగి అందరి దృష్టిని ఆకర్షించింది. 2021లో మొహాలిలో నిర్వహించిన 59వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ విభాగాల్లో శ్రేయాషి రెండు స్వర్ణ పతకాలను సాధించింది. 2024లో బెంగళూరులో జరిగిన 62వ జాతీయ చాంపియన్‌షిప్స్‌లోనూ ఇదే జోరు కొనసాగిస్తూ స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింటిలో స్వర్ణాలు గెలుచుకుంది. రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించిన భారత స్కేటర్లలో జినేష్ నానల్‌తో కలిసి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2017లో చైనాలోని నాన్‌జింగ్‌లో జరిగిన ప్రపంచ రోలర్ గేమ్స్‌లో కేవలం 12 ఏళ్ల వయసులోనే శ్రేయాషి భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఫ్రీస్టైల్, స్పీడ్ విభాగాల్లో వరుసగా 20, 22వ స్థానాల్లో నిలిచి అంతర్జాతీయ వేదికపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2025లో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి సంచలనం సృష్టించింది. ఇన్‌లైన్ ఫ్రీస్టైల్, క్లాసిక్ స్లాలోమ్‌లో స్వర్ణాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అప్పట్లో రికార్డు నెలకొల్పింది. తాజాగా చైనా గడ్డపై కాంస్య పతకం సాధించి తన విజయ ప్రస్థానంలో మరో చారిత్రక ఘనతను జోడించింది.





## బోదన, శ్రేయస్ అదరహో..

### బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో టైటిళ్లు కైవసం

### లండన్‌లో భారత సంతతి చెస్ ప్లేయర్ల సత్తా

**లండన్:** పసివయసులోనే 64 గళ్ల ఆటపై మక్కువ పెంచుకుని ఆటలో అద్భుతాలు సృష్టిస్తున్న బోదన శివానందన్, శ్రేయస్ రాయల్ బ్రిటన్ గడ్డపై సత్తాచాటారు. 122 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో భారత సంతతికి చెందిన ఈ ఇద్దరు చెస్ ప్లేయర్లూ.. తమ విభాగాల్లో టైటిళ్లు గెలిచి ఔరా అనిపించారు. సుమారు 1,750 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో 11 ఏండ్ల బోదన.. మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలువగా ఓపెన్ కేటగిరీలో17 ఏండ్ల శ్రేయస్ విజయం సాధించాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన ర్యాపిడ్ చెస్ ప్లేఆఫ్స్‌లో బోదన.. ఐర్లాండ్‌కు చెందిన 14 ఏండ్ల త్రిషా కన్యమరలను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆ చిన్నారి బ్రిటన్ యంగెస్ట్ ఉమెన్స్ చెస్ చాంపియన్‌గా సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ వెస్ట్ లండన్‌లో నివసిస్తున్న బోదన.. కోవిడ్ సమయంలో చెస్ నేర్చుకుంది. ఇప్పటికే యూకే ఓపెన్ ఉమెన్స్ బ్లిట్జ్ చాంపియన్ గెలవడంతో పాటు బ్రిటీష్ ఉమెన్స్ ర్యాపిడ్ విజేతగా నిలిచి సత్తాచాటింది. తాజాగా క్లాసికల్ ఫార్మాట్‌లోనూ ఆమె టైటిల్ గెలవడం గమనార్హం. ఇక ఓపెన్ విభాగంలో శ్రేయస్.. తొమ్మిది రౌండ్ల తర్వాత బ్రిటన్‌లో అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లను దాటుకుని పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచి విజేతగా నిలిచాడు. 15 ఏండ్ల వయసులోనే ఇంగ్లండ్‌లో అతిపిన్న గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపుపొందిన అతడు.. పుట్టింది బెంగళూరులోనే. ఎనిమిదేండ్ల క్రితం శ్రేయస్ తల్లిదండ్రులు లండన్‌లో స్థిరపడ్డారు.

# మానస అందాల మెరుపులు



సినిమాల పరంగా కాస్త నెమ్మదిగా సాగుతున్నా.. అందాల ప్రదర్శనలో మాత్రం మానస వర్మ జోరు కొనసాగిస్తోంది. 'వనవీర' తర్వాత ఆమె నుంచి మరో సినిమా ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈలోగా సామాజిక మాధ్యమాల్లో తన తాజా ఫొటోలను పంచుకుంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా రంగురంగుల దుస్తుల్లో మెరిసిన మానస వర్మ అందరి దృష్టినీ ఆకర్షించింది. నారింజ-ఎరుపు రంగు పైదుస్తులకు గులాబీ రంగు పొడవాటి స్కర్ట్‌ను జతచేసి మానస ధరించిన తీరు ప్రత్యేకంగా కనిపించింది. పలుచని పట్టీలతో కూడిన దుస్తులు ఆమెకు చక్కని వేసవి అందాన్ని తీసుకొచ్చాయి. వదులుగా వదిలేసిన ముంగురులు, సున్నితమైన బంగారు ఆభరణాలు, సహజమైన అలంకరణతో ఎంతో అందంగా కనిపించింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు చిత్రాలకు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. సరస్సు ఒడ్డున ప్రకృతి అందాల మధ్య మానస ఇచ్చిన పోజులు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రశాంతమైన నేపథ్యానికి భిన్నంగా మెరిసే దుస్తుల రంగులు ఈ చిత్రాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విహారయాత్రకు వెళ్లిన అందాల భామను తలపించేలా ఉన్న ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## మోహన్ లాల్ కుమార్తె విస్మయ

### తుడక్కం మూవీతో అరంగేట్రం




మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# సన్నని సోయగంతో కావ్యా థాపర్



**అభిమానులను ఆకట్టుకుంటున్న కథానాయిక**

**నీలిరంగు దుస్తుల్లో అందాల విందు**

**తాజా ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్**

సినిమా: కథానాయిక కావ్యా థాపర్ కొత్త రూపంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో మునుపటి కంటే మరింత సన్నగా, చక్కటి ఆకృతితో కనిపిస్తూ సందడి చేసింది. బరువు తగ్గి కొత్త రూపంలో మెరిసిపోతున్న కావ్యా ఫొటోలపై అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. నీలం రంగు ముద్రిత పొడవాటి దుస్తుల్లో కావ్యా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నడుము భాగంలో ప్రత్యేక ఆకృతి, కిందకు వాలుగా ఉన్న దుస్తుల తీరు ఆమె సోయగాన్ని మరింత ఇనుమడింపజేశాయి. చేతులకు బంగారు గాజులు, కాళ్లకు ఎత్తుమడమల చెప్పులతో అందంగా ముస్తాబైన ఆమె కెమెరా ముందు సరదాగా పోజులిచ్చింది. తన కొత్త రూపాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రదర్శిస్తూ అభిమానుల చూపు తిప్పుకోనివ్వకుండా చేసింది. కావ్యా థాపర్ చివరిసారిగా 2024లో విడుదలైన 'విశ్వం' చిత్రంలో ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత ఆమె నటించిన మరో చిత్రం తెరపైకి రాలేదు. కొత్త సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఈ భామ.. మరోవైపు ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

## పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం

'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.






## కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com